సాక్షి
విజయనగరం
సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



విద్యార్థులతో చెలగాటం..!
ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలై నేటికి ఐదు నెలలు కావస్తున్నా డిగ్రీ చదువుకునే విద్యార్థులకు నేటికీ అడ్మిషన్లు కాక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. - 8లో




ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలి
ప్రజాసమస్యల పరిష్కారమే కార్మిక సంఘాల లక్ష్యం కావాలని విప్లవవాది, సినీనటుడు ఆర్ నారాయణ మూర్తి అన్నారు. - 8లో



అర్ధరాత్రి ఇంట్లో దోపిడీ
శీరంశెట్టివానిపాలెం గ్రామంలో అర్ధరాత్రి ఓ ఇంటిలోకి ప్రవేశించిన దుండగులు కుటుంబ సభ్యులను బంధించి బంగారం, నగదును దోచుకుపోయారు. - 8లో

న్యూస్‌రీల్

మడ్డువలసకు 3200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ఒక గేటు ద్వారా నీటిని విడిచి పెడుతున్న దృశ్యం

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులోకి 3200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నీరు వచ్చి చేరుతోంది. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి నీరు వచ్చి చేరడంతో 64.45 మీటర్లు లెవెల్ నీటిమట్టం ప్రాజెక్టు వద్ద నమోదైంది. దీంతో ఒక గేటు ఎత్తి 2080 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచి పెడుతున్నామని ఏఈ నితిన్ ఆదివారం తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయనగరం అర్బన్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తమ వివరాలతోపాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్‌గా పూరించాలన్నారు. జిల్లా ప్రజలు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి

అర్జీదారులు మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి 'మీకోసం.ఏపీ.జీఓవి.ఐఎన్' వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

కౌలు రైతుకు కష్టం..!

జిల్లాలో కౌలు రైతుల కష్టాలు చెప్పనలవి కానివిగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదు. అన్నదాత సుఖీభవ ఇవ్వని కూటమి ప్రభుత్వం... రుణాల మంజూరులో విఫలమైంది. ఇటు ఎటువంటి పెట్టుబడి సాయం అందక... అటు రుణాలు కూడా అందకపోవడంతో కౌలు రైతు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ సాగును కొనసాగిస్తున్నాడు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని విధాల సాయం అందడంతో సంతోషంగా సాగు చేసిన కౌలు రైతులు కూటమి పాలనలో అన్నింటికీ దూరమై కష్టాల నడుమ సాగు కొనసాగిస్తున్నారు.

- కూటమి పాలనలో భరోసా కరువు
- ఏ సాయం అందక అవస్థలు
- జిల్లాలో 13,635 మంది కౌలు రైతులు
- వీరికి అందని అన్నదాత సుఖీభవ
- పంట రుణాలు అంతంత మాత్రమే..
- కౌలు రైతులకు రుణ లక్ష్యం రూ.140 కోట్లు
- ఇచ్చింది రూ.మూడు కోట్లే...



వరి పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

విజయనగరం ఫోర్ట్:

కౌలు రైతుల సంక్షేమానికి పాటు పడతామని ఎన్నికల వేళ గొప్పలు చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక వారి కష్టాన్ని పట్టించుకోవడం లేదు. కనీసం ఎటువంటి సాయం అందజేయడం లేదు. కూటమి పాలకులు చెబుతున్న మాటలకు క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. జిల్లాలో కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కుటుంబ పోషణకు భూమిని కౌలుకు తీసుకుని రైతులు భూమిని సాగు చేస్తున్నారు. ప్రకృతి సహకరిస్తే పరవాలేదు. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి. కౌలుకు తీసుకున్న భూమిని సాగు చేయాలంటే వారికి పెట్టుబడి కావాలి. ఇందుకోసం వారు ప్రైవేటు వ్యాపారుల దగ్గర వడ్డీకి డబ్బులు తెచ్చి పెట్టుబడి పెడుతున్నారు. కౌలు రైతులకు ప్రభుత్వం అందించే సాయంతో పాటు రుణ సాయం కూడా అందని దుస్థితి. దీంతో కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కౌలు రైతులకు కూడా సాధారణ రైతులు మాదిరి వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని వర్తింపజేసింది. దీంతో వారు పంటల సాగుకు పెట్టుబడి కోసం అప్పులు చేసే పరిస్థితి తప్పింది. రైతు భరోసా కింద వారికి రూ. 13,500 చొప్పున ఇవ్వడం వల్ల వారు వాటిని విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు పెట్టుబడి సాయంగా ఉపయోగించుకునేవారు. అదేవిధంగా కౌలు రైతులకు రుణాలు కూడా ఇచ్చింది. కూటమి ప్రభుత్వంలో కౌలు రైతుల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

చర్యలు తీసుకుంటాం..

మొదట విడతలో కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ సాయం అందలేదు. ఇంతవరకు రూ.3 కోట్ల పంట రుణాలు ఇచ్చారు. మిగతా వారికి కూడా రుణాలు అందే విధంగా చర్యలు తీసుకుంటాం.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి



కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ సాయం లేదు..

ప్రస్తుత కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయలేదు. జిల్లాలో వేలాది మంది కౌలు రైతులు ఉన్నారు. వారిలో ఏ ఒక్కరికి కూడా అన్నదాత సుఖీభవ పథకం సాయం అందని పరిస్థితి.

రుణ సాయం అంతంత మాత్రమే..

జిల్లాలో కౌలు రైతులు 13,635 మంది ఉన్నారు. వీరిలో అతి తక్కువ మందికి మాత్రమే పంట రుణాలు ఇచ్చారు. ఖరీఫ్‌లో కౌలు రైతులకు రూ.140 కోట్ల పంట రుణాలు ఇవ్వాలన్నది లక్ష్యం కాగా ఇంతవరకు కేవలం 601 మందికి రూ.3 కోట్ల రుణాలు మాత్రమే ఇచ్చారు.

దయనీయం..

కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. సాధారణ రైతులు అయితే భూమిని హామీగా చూపిస్తే ఏ వ్యాపారి అయినా డబ్బులు ఇచ్చే పరిస్థితి. కాని కౌలు రైతులకు ఆ అవకాశం కూడా లేదు. ఎందుకంటే భూమికి యాజమాని వేరొకరు ఉంటారు కాబట్టి. ఈ క్రమంలో వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు తెచ్చి పంట సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటు ప్రభుత్వం నుంచి సాయం అందక, అటు రుణాలు అందక కౌలు రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నిస్తే కేసులా?



ప్రజాస్వామ్య దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం దారుణం. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు. నిజాలను వెలికితీస్తున్న సాక్షిపై కూటమి సర్కారు అక్రమ కేసులు పెడుతోంది. పోలీసు వ్యవస్థలో లోటుపాట్లు గురించే ప్రెస్‌మీట్ వార్తలు పెడితే పత్రికా యాజమాన్యంపై కేసులు నమోదు చేసి, విచారణ పేరుతో వేధిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. సాక్షి ఎడిటర్, విలేకరులపై కేసుల నమోదును తీవ్రంగా ఖండిస్తున్నాం. పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదు.

– డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్



175 ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణమే లక్ష్యం

- పైడితల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహిస్తాం
- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయడం ప్రభుత్వ లక్ష్యమని, వీటిలో ఇప్పటికే 50 పార్కులకు శంకుస్థాపన చేశామని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత యువతను దృష్టిలో పెట్టుకొని ప్రతి నియోజవర్గంపలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 11 పార్కుల్లో ప్లాట్ల కేటాయింపు కూడా జరుగుతోందని అన్నారు. రక్షణ రంగం, స్పేస్ టెక్నాలజీ, డ్రోన్స్ తదితర రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో మరింతగా పెట్టుబడులను ఆకర్షించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. ఉత్తరాంధ్ర కల్పవల్లి విజయనగరం పైడితల్లి అమ్మవారి పండగను మునుపటి ఏడాది మాదిరిగానే భారీఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

అమ్మవారి విగ్రహ ధ్వంసం!

పార్వతీపురం రూరల్: మండలంలోని బాలగుడబ గ్రామ ప్రారంభంలో నేలబావి సమీపంలో ఉన్న దుర్గాదేవి ఆలయంలో ఉన్న అమ్మవారి విగ్రహం చేతులను గుర్తు తెలియని ఆకతాయిలు ధ్వంసం చేశారు. ఆలయంలో వున్న హుండీని ధ్వంసం చేసి నగదును సైతం దొంగలించినట్టు విశ్వహిందు పరిషత్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం అక్కడకు చేరుకొని ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా దేవతామూర్తుల స్వరూపాలపై దాడులకు పాల్పడడం దారుణమన్నారు. దీనిపై సంబంధిత పోలీసు శాఖ వారు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కలెక్టర్, ఎస్పీకి, వీహెచ్‌పీ తరఫున ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో వీహెచ్‌పీ సభ్యులు శ్రీనివాసరావు, స్థానికులు ఉన్నారు.

పోలీసుల పరిశీలన

విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ బి.సంతోషి కుమారి వెంటనే క్లూస్ టీంతో వెళ్లి పరిశీలించారు.



ధ్వంసమైన అమ్మవారి చేయి

గతంలో అమ్మవారి విగ్రహానికి ఉన్న చేయి విరిగిందని, దానిని అతికించిన అనంతరం శిథిలమై ఉండవచ్చునని స్థానికులు తెలియజేశారన్నారు. ఈ మేరకు వివరాలు సేకరించామని ఎస్ఐ తెలిపారు.

నేడు పింఛన్‌దారుల సమావేశం

పార్వతీపురం: పట్టణంలోని రైతు బజారు పక్కన వున్న విశ్రాంత ఉద్యోగుల భవనంలో పింఛన్‌దారులతో సోమవారం సమావేశం నిర్వహించనున్నట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు గంట జగన్నాథంనాయుడు ఆదివారం తెలిపారు. సమావేశంలో ఇన్‌కం టాక్స్ రిటర్న్స్, ఈ–ఫైలింగ్, భవిష్యత్ ప్రణాళిక గూర్చి చర్చించనున్నట్టు పేర్కొన్నారు. పింఛన్‌దారులు హాజరు కావాలని కోరారు.

ఉద్యమానికి రంగం సిద్ధం..!



ఉద్యమ నినాదాలతో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు(ఫైల్)

- గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది
- నెలాఖరులోగా సమస్యలను పరిష్కరించాలి
- న్యాయం జరగకుంటే విధుల బహిష్కరణే..
- అక్టోబర్ 1 నుంచి పింఛన్ పంపిణీ, సర్వే విధులకు దూరం
- జిల్లాలో 626 సచివాలయాల్లో 5,498 మంది సిబ్బంది
- ఇప్పటికే క్షేత్ర స్థాయిలో నిరసనలు

విజయనగరం అర్బన్:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, పని చేస్తున్న ఉద్యోగులపై పాలకుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. క్షేత్ర స్థాయిలో ఆ వ్యవస్థలో అందిస్తున్న సేవలను కనుమరుగు చేసే కుట్ర సాగుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే వాలంటీర్ సేవలను రద్దు చేశారు. వారి విధులను సచివాలయ ఉద్యోగులకు బలవంతంగా అప్పగించి వారి సహనాన్ని కూటమి ప్రభుత్వం పరీక్షిస్తుంది. మరో వైపు సచివాలయ సిబ్బంది నిర్వహించాల్సిన విధులను తగ్గించకుండా గత ప్రభుత్వం తీసుకొచ్చిన వాలంటరీల పింఛన్ పంపిణీ తదితర విధులు కూడా నిర్వహించాలని తొలిత పై అధికారుల వినతి నేపథ్యంలో చేపట్టారు. ప్రస్తుతం వాటిని తప్పనిసరి చేస్తూ సచివాలయ సిబ్బందికి పనిభారం పెంచారు. దీనితో పాటు ఉద్యోగులకు న్యాయబద్ధంగా దక్కాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లు విడుదల చేయకుండా ఏడాదిగా పెండింగ్‌లో ఉంచిన డిమాండ్‌లతో పాటు పని ఒత్తిడి తగ్గించాలని సచివాలయ సిబ్బంది డిమాండు చేస్తున్నారు. సెప్టెంబర్ నెలాఖరుకల్లా ప్రధాన డిమాండ్‌లను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు జేఏసీ (ఏపీజీడబ్ల్యూఎస్ఈ జేఏసీ) ఐక్యవేదిక ఇప్పటికే అల్టిమేటం జారీ చేసింది. లేదంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించింది. జిల్లాలో ఉన్న 626 సచివాలయాల్లో భర్తీ చేసిన 14 కేటగిరీల వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది 5,498 మంది ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా సచివాలయాలు, పని చేస్తున్న సిబ్బంది

అసెంబ్లీ నియోజకవర్గం	సచివాలయాలు	వర్కింగ్ సిబ్బంది
బొబ్బిలి	94	813
చీపురుపల్లి (రూరల్)	83	778
గజపతినగరం(రూరల్)	87	754
నెల్లిమర్ల (రూరల్)	79	657
రాజాం (రూరల్)	96	811
ఎస్‌కోట	94	931
విజయనగరం	74	608
సాలూరు (మెంటాడ)	19	146
మొత్తం	626	5,498

ప్రధాన డిమాండ్‌లలో కొన్ని..

సచివాలయ ఉద్యోగులు సర్వీస్‌లో చేరి ఆరు సంవత్సరాలు పూర్తయినా నోషనల్ ఇంక్రిమెంట్లు ఇప్పటికీ మంజూరు చేయలేదు. ఒకే కేడర్‌లో ఆరు సంవత్సరాలు పూర్తి చేసిన వారికి ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీమ్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలన్న నిబంధన అమలు కాలేదు. పనిభారం.. అన్యాయమైన ఆదేశాలను ఉద్యోగులు ఎదుర్కొంటున్నారు. పండగలు, ఆదివారాలు, సెలవు దినాల్లోనూ తప్పనిసరి విధులు, ఇంటింటి సర్వేల వల్ల ఉద్యోగుల ఆత్మ గౌరవం దెబ్బతింటోంది. రోజువారీ లక్ష్యాలతో ఒత్తిడితో కుటుంబ జీవితం దూరమవుతోంది.

అనైతిక బదిలీల ప్రక్రియ. బదిలీల కోసం ప్రత్యేక నిబంధనలు రూపొందించి, స్టేషన్ సీనియారిటీ ఆధారంగా పారదర్శక విధానాన్ని అమలు చేయాలి. పే స్కేల్ అసమానతలు తొలగించి, కేడర్ అప్‌గ్రేడ్ చేయాలి.

ఉద్యోగుల సహనాన్ని పరీక్షించొద్దు



కొన్నాళ్లుగా ప్రభుత్వ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ తమ సమస్యలు పరిష్కరించకపోవడంతో ఉద్యోగులు విసుగు చెందారు. ప్రధానమైన ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై చర్చలు జరిపి న్యాయం చేయకపోతే రానున్న అక్టోబర్ 1 నుంచి పెన్షన్ పంపిణీతో సహా ఇతర సర్వేలు చేయం. బకాయిలు, రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు తక్షణమే చెల్లించాలి. సచివాలయ సిబ్బంది సహనాన్ని పరీక్షించవద్దు.

–మధుబాబు బూరాడ, రాష్ట్ర చైర్మన్, ఏపీజీడబ్ల్యూఎస్ఈ జేఏసీ

వాలంటీర్ విధులను అప్పగించరాదు



వాలంటీర్ విధులను సచివాలయ ఉద్యోగులకు అప్పగించరాదు. డిపార్ట్‌మెంట్ వారీగా నిర్దిష్ట జాబ్ చార్ట్ పనులు మాత్రమే అప్పగించాలి. గ్రామ వార్డు సచివాలయం గొడుగులో ఉన్న అన్ని డిపార్ట్‌మెంట్లకు ఒకే బేసిక్ పేతో ప్రమోషన్లు ఇచ్చి, పీఆర్‌సీ స్లాబ్ వర్తింపజేయాలి. డిపార్టుమెంట్ల వారీగా మాతృ శాఖల్లో విలీనం చేయాలి. ప్రతి సంవత్సరం వచ్చే పీరియాడికల్ ఇంక్రిమెంట్ తక్షణమే అమలు చేయాలి.

–వెంపడాపు కాశినాయుడు, జిల్లా అధ్యక్షుడు, ఏపీజీడబ్ల్యూఎస్ఈ జేఏసీ

'అంగన్‌వాడీ'లపై ధరాభారం

- కేంద్రాల నిర్వహణలో పెరిగిన వ్యయం..
- అంగన్‌వాడీ కేంద్రాలకు అదనపు ఖర్చులు
- 2022 ఫిబ్రవరి ధరలకు అనుగుణంగానే ఇప్పటికీ బిల్లుల చెల్లింపు
- ప్రస్తుతం మూడు రెట్లు పెరిగిన నిత్యావసరాల ధరలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

రామభద్రపురం:

చిన్నారులకు తొలి బడి అమ్మ అయితే.. మలి బడి అంగన్‌వాడీ కేంద్రాలే. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కేంద్రాలకు వచ్చే చిన్నారుల భవితను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వీటిలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి. ప్రస్తుత ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచుతామని ప్రభుత్వం చెబుతున్నా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటికీ కనీస ఆలోచన చేయలేదని విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు భారీగా పెరగడంతో కార్యకర్తలకు భారంగా మారింది. అసలే వారి జీతాలు అంతంత మాత్రం. దీనికి తోడు పాత ధరల ఆధారంగా బిల్లులు చెల్లిస్తుండడంతో వంట ఖర్చులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కేంద్రాల్లో పౌష్టికాహారం ఇచ్చి ధరలను పెంచాలని కార్యకర్తలు వినతులు ఇవ్వడంతో పాటు డిమాండ్ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రీ స్కూల్ పిల్లల ఆహారం కోసం కూరగాయలు, ఆకు కూరలు, పసుపు, చింత పండు, కారం, పోపు తదితర సామగ్రి ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలి. వీటి కొనుగోలుకు ఒక చిన్నారికి వారానికి రూ.50 ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిసింది. ఇవి ఏమాత్రం సరిపోవడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. వారానికి ఒకరికి కూరగాయలు, పోపులకు రూపాయిన్నర, గ్యాస్‌కు నెలకు రూ.450 చొప్పున్న ఇస్తున్నారు. సిలిండర్ రూ.950 లకు కొనుగోలు చేస్తున్నామని ప్రస్తుతం పెరిగిన ధరల కారణంగా మెనూ ప్రకారం వండి పెట్టాలంటే అదనపు భారం తప్పడం లేదని అంగన్‌వాడీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెనూ ప్రకారం బిల్లులు

మెనూ ప్రకారం 2022 ఫిబ్రవరి ధరలకు అనుగుణంగా ప్రస్తుతం బిల్లులు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరల మూడు రెట్లు పెరిగాయి. అలాగే గ్యాస్ ధర కూడా బిల్లు చెల్లించిన దానికంటే అదనంగా మరో రూ.500 వరకు పెరిగింది. ప్రస్తుతం మెనూ ప్రకారం వండి పెట్టాలంటే తమకు భారంగా ఉందని ప్రస్తుత ధరల ప్రకారం బిల్లులు చెల్లించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహించేందుకేనా..

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను ప్రోత్సహించేందుకే బాల్య దశలోనే విద్యా పరంగా గట్టి పునాదులు వేసే అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రైవేటు పాఠశాలలకు చిన్నారులు మళ్లే అవకాశం ఉంది. సాధారణంగా చిన్నారులు ప్రీ స్కూల్‌కు ఎక్కడ చేరితే అదే విద్యా సంస్థల్లోనే విద్యార్థిగా కొనసాగే అవకాశం ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తే చిన్నారులు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఎల్‌కేజీ, యూకేజీల్లో చేరే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఆ తర్వాత కూడా ప్రైవేట్ పాఠశాలల్లోనే చదువు కొనసాగిస్తారు. దీంతో ప్రైవేట్ యాజమాన్యాలకు మేలు చేకూరుతుంది. కేవలం కార్పొరేట్ విద్యా సంస్థలకు మేలు చేకూర్చేందుకే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రభుత్వ ఆలోచన కూడా అదే రీతిలో ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



కనిమెరక వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆట వస్తువులతో చిన్నారులను ఆడిస్తున్న కార్యకర్త

మెనూ ఇలా..	
సోమవారం	దోసకాయ పప్పు
మంగళవారం	టామాటా పప్పు
బుధవారం	ఆకుకూర పప్పు
గురువారం	కూరగాయలతో సాంబారు
శుక్రవారం	బీరకాయ లేదా సొరకాయ పప్పు
శనివారం	వెజిటబుల్ బాత్ రైస్

ఉన్నతాధికారులకు విన్నవించాం..

కొత్త ధరలు ప్రకారం బిల్లులు ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. ఆ విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవించాం. ప్రభుత్వం పెంచిన వెంటనే కొత్త ధరల ప్రకారం బిల్లులు పెడతాం.

– ఎం.వరహాలమ్మ, సీడీపీవో, బాడంగి

జిల్లాలో ఇలా..	ఐసీడీఎస్ ప్రాజెక్టులు	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	ఆరేళ్లలోపు చిన్నారులు
	11	2499	7159	5900	58559

క్లుప్తంగా

ఉత్తరాంధ్ర క్విజ్ పోటీల్లో విజేత గరివిడి



గరివిడి జట్టుకు బహుమతి అందజేస్తున్న మెగా యూత్ సభ్యులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామం రైల్వే గేటు సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రుల సందర్భంగా గ్రామానికి చెందిన మెగా యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తరాంధ్ర క్విజ్ పోటీలను నిర్వహించారు.ఈ పోటీల్లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 25 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ పోటీల్లో మొదటి స్థానంలో గరివిడి మండల జట్టు నిలిచింది. అలాగే ద్వితీయ స్థానంలో డెంకాడ, తృతీయ స్థానంలో నెల్లిమర్ల, నాలగవ స్థానంలో విజయనగరం జట్టు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ 8వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ 2వేలు నగదు బహుమతులు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.


ఆనకట్టకు జలకళ



నారాయణపురం ఆనకట్ట

సంతకవిటి: మండలంలోని రంగారాయపురం వద్ద నారాయణపురం ఆనకట్ట జలకళను సంతరించుకుంది. ఆనకట్ట వద్ద షట్టర్ల పైనుంచి వరద నీరు జలపాతంలా దిగువకు జాలువారుతోంది. దీంతో ఆనకట్ట వద్ద ఆహ్లాదకర వాతావరణం సంతరించుకుంది.

లారీ ఢీకొని హిజ్రా మృతి



ప్రమాద స్థలంలో మృతదేహం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం టోల్ ప్లాజా వద్ద లారీ ఢీకొని హిజ్రా మతి చెందినట్లు పెదమానాపురం ఎస్సై ఆర్.జయంతి ఆదివారం తెలిపారు. బీసీ కాలనీలో ఉంటున్న తొటి హిజ్రాలను కలవడానికి వచ్చి తిరిగి ప్రయాణంలో వెళ్తుండగా సాలూరు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మతి చెందింది. ఎక్కడ నుంచి వచ్చారు? ఎందుకు వచ్చారు? పేరు? చిరునామా? తదితర వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై చెప్పారు.

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడి మృతి



గౌరు మృతదేహం

మక్కువ: మండల కేంద్రం మక్కువలో విద్యుదాఘాతంతో ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని చప్పబుచ్చంపేట పంచాయతీ ఎం.పాలికవలస గ్రామానికి చెందిన పాల.గౌరు(39) తాపీమేస్త్రిగా జీవిస్తున్నాడు స్థానిక బీసీ కాలనీలో ఓ ఇంటి నిర్మాణ పనులను కాంట్రాక్ట్‌కు తీసుకున్నాడు. ఆదివారం ఇంటి శ్లాబ్ పరిశీలించడానికి గౌరు వెళ్లాడు. మేడ మీదికి వెళ్లి పిట్టగోడ ఎక్కి, శ్లాబ్‌ను పరిశీలించి దిగుతున్న క్రమంలో ఇంటి పక్కన వేలాడుతున్న విద్యుత్ వైర్లను ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురై నేలపై పడిపోగా తలపై, నుదుటిపై గాయాలు తగిలి మృతిచెందాడు. మృతుని భార్య పైడితల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన సాయి

సాలూరు: పట్టణంలోని బంగారమ్మ కాలనీలో గల గొడగొల వీధికి చెందిన జలుమూరు సాయి (28) ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ, మద్యానికి బానిసై అనారోగ్యం పాలై భార్యాపిల్లలకు దూరంగా ఉండడంతో మనస్తాపానికి గురయ్యాడన్నారు. ఈ క్రమంలో ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని సోదరుడు ఉమ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని అన్నారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారని చెప్పారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹152	₹274	₹284

విద్యార్థులతో చెలగాటం..!

- డిగ్రీ ప్రవేశాల్లో గందరగోళం
- ఇప్పటికే సీట్లు ఖరారై పలుమార్లు వాయిదా
- ఆంధ్రా విశ్వవిద్యాలయం పరిధిలో 30వేలమంది ఎదురు చూపు
- తరగతులు నిర్వహిస్తున్నా అడ్మిషన్లు కాకపోవడంతో ఆందోళన
- ఇంటర్ ఫలితాలు విడుదలైనా ప్రవేశాలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం



పార్వతీపురం ఎస్‌వీడీ డిగ్రీ కళాశాల

పార్వతీపురం రూరల్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు దాదాపు 10 ఉన్నాయి. ఇంటర్‌మీడియట్ ఫలితాలు విడుదలై నేటికి ఐదు నెలలు కావస్తున్నా డిగ్రీ చదువుకునే విద్యార్థులకు నేటికీ అడ్మిషన్లు కాక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. డిగ్రీ ప్రవేశాలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని స్పష్టంగా అర్థమవుతోంది. ఈ ఏడాదిలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా తీవ్రస్థాయిలో జాప్యం జరుగుతోంది. ఫలితంగా సెప్టెంబర్ 3వ వారం వచ్చినా అడ్మిషన్లు జరగక తరగతులు ప్రారంభం కాక విద్యార్థులు, కళాశాల యాజమాన్యాల్లో తీవ్ర స్థాయిలో ఆందోళన నెలకొంది. ఇతర రాష్ట్రాల్లో విడతల వారీగా చేపట్టిన ప్రవేశాలు ఇప్పటికే పూర్తయి తరగతులు నిర్వహిస్తున్నారు. ఇది కేవలం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్టగా విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు పేర్కొంటున్నారు. మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖలో ఇలా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం పట్ల విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే రెండు దఫాలుగా వాయిదా

దాదాపు 30వేలమంది విద్యార్థులు ప్రతి ఏడాది వివిధ కోర్సుల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న సుమారు 191 డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పొందుతారు. ఈ ఏడాది విద్యాసంవత్సరంలో కూటమి ప్రభుత్వం సంస్కరణల పేరట డబుల్ మేజర్ విధానం తెచ్చేందుకు మూడు నెలల క్రితం దానికి సంబంధించి షెడ్యూల్ ఇచ్చి కళాశాలల ద్వారా దరఖాస్తులు తీసుకుంది. అయితే ప్రక్రియ అంతా ముగిసిన వెంటనే మళ్లీ పాత విధానం అంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మళ్లీ కళాశాలల యాజమాన్యాలను కొత్తగా కోర్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక కళాశాలలకు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాలని హడావిడి చేశారు. ఈ పక్రియ కూడా పూర్తయ్యాక గత నెల 20న ఆన్‌లైన్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆగస్టులో 20 నుంచి 26వరకు ప్రవేశాల రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని ఆగస్టు 24 నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్లకు గడువు ఇచ్చారు. ఈ మేరకు ఈనెల 1 నుంచి తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపంతో సకాలంలో తెరుచుకోకపోవడంతో ఈనెల 3వ తేదీవరకు ప్రవేశాలకు, 4వ తేదీవరకు ఆప్షన్లు పెట్టుకోవడానికి గడువు పొడిగించారు. ఈనెల 8వ తేదీన సీట్ల కేటాయింపు, కళాశాలల్లో విద్యార్థుల రిపోర్టింగ్‌కు గడువు ఇచ్చారు. ఈనెల 9న ప్రవేశాలు పొందిన విద్యార్థులకు తరగతుల నిర్వహణ ప్రారంభమవుతుందని మరోసారి తాజాగా ఇచ్చిన షెడ్యూల్‌లో ప్రభుత్వం పేర్కొంది. అయితే గడువు పూర్తయినప్పటికీ నేటివరకు విద్యార్థులకు సీట్ల కేటాయింపు పూర్తి కాలేదు. సోమవారం జరిగే అవకాశం ఉంటుందని వారికొచ్చిన సమాచారం మేరకు యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే మొదటి విడత సీట్ల కేటాయింపుపై ఇంతవరకు స్పష్టత లేక కాకపోవడంతో రెండు, మూడు విడతలకు సంబంధించి అలాగే స్పాట్, యాజమాన్య కోటా ప్రవేశాలు జరగడానికి మరికొంత జాప్యం జరిగే అవకాశం స్పష్టంగా కనబడుతోంది. ప్రభుత్వం చేసిన ఈ జాప్యం కారణంగా మొదటి ఏడాది సిలబస్, సబ్జెక్టు క్రెడిట్‌లో మార్పులు చేశారు. ప్రవేశాలు పూర్తయ్యి తరగతులు ప్రారంభమయ్యే సమయానికి మార్కెట్‌లో పుస్తకాలు దొరుకుతాయో లేదో అన్న ఆందోళన కూడా విద్యార్థులను పీడిస్తోంది. ఈ క్రమంలో డిగ్రీ ప్రవేశాల్లో భారీగా తగ్గుదల ఉంటుందని, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఆందోళన చెందుతున్నాయి.

సగం విద్యాసంవత్సరం గడిచింది



గతంలో ఎన్నడూ లేని విధంగా, ఎప్పుడూ జరగని విధంగా ఈ ఏడాది ప్రభుత్వ నిర్లక్ష్యంతో డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ తీవ్ర జాప్యం నెలకొంది. కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలే దీనికి కారణం. ఇప్పటికే సగం విద్యాసంవత్సరం కూడా గడిచిపోయింది. మిగిలిన తరగతుల విద్యార్థులంతా త్వరలో సెమిస్టర్ పరీక్షలు రాయనున్నారు. కానీ డిగ్రీ మొదటి సంవత్సరం సిలబస్ ఎప్పుడు పూర్తి చేస్తారో, పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇంటర్ ఫలితాలు విడుదలై ఐదునెలలు గడుస్తున్నా డిగ్రీ ప్రవేశాలు చేపట్టకపోవడం ముమ్మాటికీ కూటమి ప్రభుత్వం వైఫల్యమేనని స్పష్టంగా అర్థమవుతోంది. ప్రభుత్వం ఈ విధంగా డిగ్రీ విద్యార్థులతో ఆటలాడుకోవడం సరికాదు. ఇంకా ఆలస్యం చేస్తే భవిష్యత్‌లో విద్యార్థుల ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయి.

బోను రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి, అఖిల భారత విద్యార్థి సమాఖ్య

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలి

- సీఐటీయూ రాష్ట్ర నాయకులు
- ముగిసిన మహాసభలు



జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న ఆర్. నారాయణమూర్తి

పాలకొండ: ప్రజాసమస్యల పరిష్కారమే కార్మిక సంఘాల లక్ష్యం కావాలని విప్లవవాది, సినీనటుడు ఆర్ నారాయణ మూర్తి అన్నారు. రెండు రోజులుగా పాలకొండ పట్టణంలో నిర్వహిస్తున్న సీఐటీయూ 11వ జిల్లా మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సమావేశంలో నారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు ఉన్నది ప్రజలకు సేవ చేసేందుకు అని తెలిపారు. సమసమాజ స్థాపన కోసం కార్మిక నాయకులు పోరాటాలు చేయక తప్పదన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పోరాటాలపై నిర్బంధాలు విధిస్తున్నాయని మండిపడ్డారు. పోరాటాలతోనే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు. కార్మికులు, ఉద్యోగులు, చివరికి అధికారులపైన కూడా కూటమి ప్రభుత్వం రాజకీయ వేధింపులు చేపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్వతీపురం ఎమ్మెల్యే కార్మికులపై ఉక్కుపాదం మోపే చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. అణిచివేత ధోరణితో ప్రభుత్వం పాలన సాగిస్తోందని, పోలీసులను పావులుగా వాడుతోందని ఆరోపించారు. రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ మహాసభల్లో చూపించిన స్ఫూర్తితో పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం 47 మంది సభ్యులతో జిల్లా కమిటీని ఎంపిక చేశారు. ఈ సమావేశాల్లో పలు ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు దావాల రమణారావు, మన్మథరావు, ఎం.కృష్ణమూర్తి, కె.రామస్వామి, తిరుపతిరావు పాల్గొన్నారు.

గురజాడ నివాసాన్ని స్మారక కేంద్రంగా తీర్చిదిద్దాలి

- జనవిజ్ఞాన వేదిక డిమాండ్



మయూరి కూడలి నుంచి గురజాడ నివాసం వరకూ జేవీవీ ఆధ్వర్యంలో సైన్స్‌వాక్

విజయనగరం గంటస్తంభం: సాహిత్య కారుడు, మహాకవి గురజాడ అప్పారావు నివాసాన్ని స్మారక కేంద్రంగా తీర్చిదిద్దాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక మయూరి జంక్షన్ నుంచి గురజాడ అప్పారావు నివాసం వరకూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సమాజంలోని అసమానతలను బటయపెట్టారన్నారు. ప్రభుత్వం గురజాడ నివాసాన్ని స్వాధీనం చేసుకుని, స్మారక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దీనిపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలుగు ప్రజలు అందరూ గౌరవంతో దర్శించుకునే విధంగా గురజాడ గృహాన్ని పునఃనిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గురజాడ అప్పారావు జయంతి, వర్ధంతిలను రాష్ట్ర పండగలుగా నిర్వహించాలని సూచించారు. ఆయన పేరు మీద సాంస్కృతిక విశ్వవిద్యాలయం స్థాపించాలని చెప్పారు. సైన్స్ వాక్‌లో పాల్గొన్న కళాకారులు గురజాడ గేయాలను ఆలపించి, గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు, మహాసభ ప్రతినిధులు, కవులు, విద్యావేత్తలు,మేధావులు, కళాకారులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో జొన్నగుడ్డిలో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిపై ఎస్‌ఐ లక్ష్మీప్రసన్నకుమార్ కేసు నమోదు చేశారు. జొన్నగుడ్డిలోని రామాలయం పక్కన ఒక ఇంట్లో ఐదుగురు పేకాట ఆడుతుండడాన్ని గుర్తించి టౌన్ న్యూసెన్స్ యాక్ట్‌కింద జూదరులను అరెస్టు చేసి రూ.17వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగిన ఉపాధ్యాయుల నిరసన వారం

- మంత్రి కొండపల్లికి వినతి



కలెక్టరేట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసనలో ఏపీటీఎఫ్ సభ్యులు

విజయనగరం అర్బన్: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించనున్న నిరసన వారం కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగింది. ఈ మేరకు కలెక్టరేట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం ఎదుట ఉపాధ్యాయులు నిరసన నినాదాల కార్యక్రమం చేపట్టారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. నిరసన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఇంతవరకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు విడుదల చేయాలి. సీపీఎస్ రద్దు, ఐఆర్ (ఐఆర్) ప్రకటన, బకాయిల చెల్లింపు హెల్త్ కార్డు పరిమితి పెంపు, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానం రద్దు తదితర డిమాండ్‌లు పరిష్కరించాలని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ కర్రి రవి, జిల్లా అధ్యక్షుడు షేక్ బుకారీ బాబూ, ప్రధాన కార్యదర్శి పాల్తేరు శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్ కర్రి రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు మజ్జి రమేష్, మామ్రావు శ్రీనివాస్, కె.వెంకునాయుడు, టి.శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, సుగుణాకరరావు, పి.సత్యన్నారాయణ కె.వెంకటరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెస్క్యూ



నాగావళి నది గర్భంలో వెతుకుతున్న పోలీస్, అగ్నిమాపక సిబ్బంది

పాలకొండ రూరల్: మండలంలోని గొట్ట మంగళాపురం సమీపంలో వంతెనపై నుంచి నాగావళి నదిలో శనివారం సాయంత్రం ఓ గుర్తు తెలియని మహిళ దూకిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అటు విజయగరం జిల్లా రేగిడి, ఇటు మన్యం జిల్లా పాలకొండ సివిల్ పోలీసులతో పాటు స్థానిక అగ్నిమాపక అధికారులు వెతుకులాట చేపట్టారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింది. అనుభవజ్ఞులైన ఈతగాళ్లతోపాటు డ్రోన్ సాయంలో కొంత మేరా శోధించారు. అయినప్పటికీ ఎటువంటి ఫలితం లేనట్లు స్థానిక ఎస్సై కె.ప్రయోగమూర్తి తెలిపారు. కేవలం వంతెనపై లభించిన పాదరక్షలు మినహా ఎటువంటి క్లూ గాని, మహిళను సజీవంగా, నిర్జీవంగా గుర్తించలేదన్నారు. తీరం వెంబడి గ్రామాలకు సమాచారం అందించామని, ఇరు జిల్లాల పరిధిలో ఎక్కడా మిస్సింగ్ కేసులు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన తుది జట్లతో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, శిక్షకులు

పాలకొండ రూరల్: ఈనెల 24 నుంచి 28 వరకూ ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సంబంధించిన జిల్లా జట్టు ఎంపిక ఆదివారం పాలకొండలో జరిగింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో జరిగిన ఈ ఎంపిక పోటీలకు జిల్లా పరిధిలో 15 మండలాలకు చెందిన 20 ఏళ్ల లోపు ఔత్సాహికులు హాజరయ్యారు. జూనియర్ విభాగానికి చెందిన ఎంపికలో బాలురు 70 మంది, బాలికలు 50 మంది ప్రతిభ కనబర్చారు. తుది జట్టులో 14 మంది వంతున రెండు జట్లను బాల,బాలికల నుంచి ఎంపిక చేశారు. అత్యంత ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ సంఘం గౌరవ అధ్యక్షుడు పల్లా కొండలరావు, అధ్యక్షుడు కోడి సుదర్శనరావు, కార్యదర్శి వెన్నపు చంద్రరావు(శేఖర్) తదితరులు తెలిపారు.

ప్రకృతి అందాల కనువిందు



పచ్చని సౌందర్యంతో కనువిందు చేస్తున్న రామతీర్థం, సీతారామునిపేట పంటపొలాలు



ఎత్తైన బోడికొండతో అందంగా కనిపిస్తున్న సీతారామునిపేట చెరువు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం పరిసర ప్రాంతాలు సహజ సిద్ధ సౌందర్యానికి నిలయంగా మారుతున్నాయి. ఒక వైపు ఎత్తైన బోడికొండ. మరో వైపు నిండుకుండలా చెరువు ఎంతో అందంగా దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు రామతీర్థం, సీతారామునిపేట పరిసర ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో ఉన్న వరి పంట పొలాలు పచ్చని సౌందర్యంతో కనువిందు చేస్తున్నాయి. ఈ దృశ్యాలు కళ్లకు హాయినిస్తూ, మనసుకు ఆనందాన్ని పంచుతున్నాయని ప్రకృతి ప్రేమికులు మురిసిపోతున్నారు. ఆదివారం ఈ అందమైన దృశ్యాలను సాక్షి తన కెమెరాలో బంధించింది.

క్రైస్తవ విశ్వాసులు లోకానికి వెలుగునివ్వాలి

- ప్రముఖ క్రైస్తవ ఆధ్యాత్మిక వేత్త బెన్నీ ప్రసాద్
- ముగిసిన సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 150వసంతాల వేడుక



ఆధ్యాత్మిక దైవసందేశాన్ని అందజేస్తున్న బెంగళూరు బెన్నీప్రసాద్, తెలుగులో అనువాదం చేస్తున్న పాస్టర్ యబ్బోజు చౌదరి

విజయనగరం టౌన్: క్రైస్తవ విశ్వాసులు లోకానికి వెలుగై ఉన్నారని, అటువంటి క్రైస్తవులందరూ దీపంలా అనేకులకు వెలుగునివ్వాలని ప్రముఖ క్రైస్తవ ఆధ్యాత్మిక వేత్త బెన్నీ ప్రసాద్ (బెంగళూరు) పేర్కొన్నారు. సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 150వసంతాల వేడుకల్లో చివరిరోజు ఆదివారం చర్చి ఆవరణలో నిర్వహించిన ఆధ్యాత్మిక సమావేశంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో పాటూ జిల్లాలోని ఆధ్యాత్మిక క్రీస్తు సహోదరులకు ఆయన దైవసందేశాన్ని అందజేశారు. ఆయన ఆంగ్లభాషలో చెప్పిన దేవుని వాక్యాలను పాస్టర్ యబ్బోజు చౌదరి తెలుగులోకి అనువదించి భక్తులకు వివరించారు. విశ్వాసంతో, ఆసక్తితో ప్రార్థన చేస్తే దేవుని రక్షణ పొందగలమన్నారు. అద్భుతమైన గిటార్ వాయిద్య సహకారంతో దేవుని కీర్తనాలాపన చేస్తూ, ఆధ్యాత్మిక విషయాలను బోధించారు. సంఘమిత్ర ఆర్ఎస్.జాన్ మాట్లాడుతూ సిమ్స్ చర్చి 150వసంతాల వేడుకలను పెద్దలందరి సహాయ, సహకారాలతో అంగరంగ వైభవంగా నిర్వహించుకోగలిగామన్నారు. ఐదురోజుల పాటు నిర్వహించిన క్రైస్తవ మహాసభలకు హాజరై ఆధ్యాత్మిక దైవసందేశాన్నిచ్చిన పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిమ్స్ జూబ్లీ కమిటీ చైర్మన్ ఎం.ఎ.నాయుడు, కార్యదర్శి తాలాడ ఆనందరావు, వై.ప్రభాకర్, ఆశాజాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

సంతకవిటి: మండల పరిధి జీఎంఆర్ ఐటీ సమీపంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు ఏఎస్సై ఎం.వాసుదేవరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రేగిడి ఆమదాలవలస మండలం ఆడవరం గ్రామానికి చెందిన బంకి సింహాచలం, భార్య రమణమ్మ, రేగిడి ఆమదాలవలస నుంచి మనుమరాలు రితికను తీసుకుని చీపురుపల్లి లోని తన కుమార్తె ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో రాజాం పాలకొండ ప్రధాన రహదారిలో జీఎంఆర్ ఐటీ సమీపంలో వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ వారి బైక్‌ను దాటుకుని ముందుకు వెళ్లి వీధిలోకి తిప్పే క్రమంలో మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి, ముగ్గురు ప్రస్తుతం రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బంకి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

రేడియోగ్రాఫర్‌కు మందలింపు

విజయనగరం క్రైమ్: సర్వజన ఆసుపత్రిలో శనివారం జరిగిన ఘటనపై విజయనగరం వన్‌టౌన్ పోలీసులకు ఆదివారం వచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేయకుండా మందలించి పంపించేశారు. వివరాల్లోకి వెళ్తే..గజపతినగరానికి చెందిన ఒక మహిళకు ఫైల్స్ ఆపరేషన్ నిమిత్తం ఆస్పత్రి వైద్యుడు ఎక్స్‌రేకు రిఫర్ చేశారు. ఎక్స్‌రే కోసం రూమ్‌లోకి వెళ్లిన మహిళపై సదరు రేడియోగ్రాఫర్ అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయమై వన్‌టౌన్ ఎస్సై లక్ష్మీ ప్రసన్నకుమార్ రేడియోగ్రాఫర్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశారు. ఫిర్యాదు దారురాలి భర్త అభ్యర్థన మేరకు రేడియోగ్రాఫర్‌ను తమదైన శైలిలో పోలీసులు కోటింగ్ ఇచ్చారు. రేడియోగ్రాఫర్ ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఉద్యోగ రీత్యా ఇబ్బంది కలుగుతుందని కేసు నమోదు చేయవద్దని బాధితులు చెప్పడంతో నమోదు చేయలేదని ఎస్సై లక్ష్మీ ప్రసన్నకుమార్ తెలిపారు.

అర్ధరాత్రి ఇంట్లో దోపిడీ

- హడలిపోయిన కుటుంబ సభ్యులు



బాధిత కుటుంబసభ్యులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఐ అప్పలనాయుడు

కొత్తవలస: మండలంలోని చింతలపాలెం సమీపంలో గల శీరంశెట్టివానిపాలెం గ్రామంలో ఒక ఇంటిలో అర్ధరాత్రి ఇంటి తలుపులు కొట్టి తీయగానే ఇంటిలోకి ప్రవేశించి కుటుంబసభ్యులను బంధించి బంగారం, నగదును దుండగులు దోచుకుపోయారు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మీసాల రవిప్రకాష్ గ్రామానికి కొంతదూరంలో ఇల్లు కట్టుకుని కుటుంబంతో నివసిస్తున్నాడు. శనివారం రాత్రి రవిప్రకాష్ కేటరింగ్ పని నిమిత్తం గాజువాక వెళ్లాడు. ఇంట్లో భార్య సత్యవతి, మామ, అత్త, ఇద్దరు పిల్లలు తలుపులు గడియలు పెట్టి నిద్రపోయారు. ఈ క్రమంలో రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఒక వ్యక్తి వచ్చి తలుపు తట్టడంతో రవిప్రకాష్ మామ తలుపు తెరిచాడు. సదరు దుండగుడు ఒక్కసారిగా ఆయనపై విరుచుకుపడి స్క్రూడ్రైవర్‌తో చెవిభాగంలో పొడిచి లోనికి ప్రవేశించాడు.ఇంతలో మరో ఐదుగురు వ్యక్తులు ముఖాలకు ముసుగులు తొడుక్కుని ఇంటిలోకి ప్రవేశించారు. అత్త, మామను ఒక గదిలోను, భార్య సత్యవతి, ఇద్దరు పిల్లలను మరో గదిలో బంధించి బంగారం, డబ్బు ఎక్కడ ఉందో చెప్పాలని భయభ్రాంతులకు గురిచేశారు. గొడవ చేసి అరిస్తే చంపేస్తాం అంటూ హిందీ, తెలుగు బాషల్లో భయపెట్టారు.

పరిశీలించిన పోలీసులు

బలవంతంగా బీరువా తెరిచి అందులో గల బంగారం తాడు, ఉంగరం, శతమానాలు తదితర వస్తువులు రెండున్నర తులాల బంగారం, కొంత వెండి, రూ 24వేల నగదు దోచుకున్నారు.రవిప్రకాష్ అత్త చేతులకు ఉన్న గాజులు, చెవిదిద్దులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవి ఇత్తడి వస్తువులు అని చెప్పినా వినకుండా వాటిని సైతం లాక్కుని పోయారు. మొత్తం ఆరుగురు దుండగులు చేతికి అందింది దోచుకుని బయటకు వెళ్లి తలుపు గడియ పెట్టి వెళ్లిపోయారు. దీంతో రవిప్రకాష్ అత్తయ్య వద్ద గల ఫోన్‌లో గాజువాకలో గల రవిప్రకాష్‌కు జరిగిన విషయం తెలియపరచగా ఆయన పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి, చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేశాడు. అందరూ వచ్చి తలుపులు తీయగా కుటుంబసభ్యులు బయటకు వచ్చారు. బాధితుడు రవిప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు, స్థానిక ఎస్సై ఎస్.జోగారావుతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. విజయనగరం నుంచి ప్రత్యేక క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జోగారావు తెలిపారు.